# గ్రహణం

పాతికేళ్లుంటాయి అతనికి. ఓ వైన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. నీట్‌గా డ్రెస్ చేసుకుని ట్రిమ్‌గా తయారవుతాడు. సినిమాలు తెగచూస్తాడేమో తన అభిమాన హీరోతో తనను పోల్చుకుని తానే ఆ హీరో అయినట్లు ఫీలయిపోతుంటాడు.

అతని దృష్టి పద్దెనిమిదేళ్ల పాయల్ మీద పడింది. పాయల్ ఎర్రగా బుర్రగా వుంటుంది. వీకెండ్స్ కాలేజ్‌లో డిగ్రీ ఫస్టియర్ చదువుతోంది. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆ అమ్మాయి ఎంతో అణకువగా మసలుకుంటుంది. చదువు తప్ప అన్య ధ్యాస లేనిది. పాయల్ కాలేజీకి వెళ్లే బస్టాపుకు ఇంటి నుండి కొంత దూరం నడవవలసి ఉంటుంది. ఆ దారిలోనే వుంది ఆ యువకుడు పనిచేసే వైన్ షాప్. ఆ విధంగా అతని కంట పడిందామె.

పాయల్‌ని చూసిన క్షణంలోనే నిశ్చయించేసుకున్నాడు అతను... తన హీరోయిన్ ఆమేనని! ఆమె వెనుకే



బస్టాపు వరకూ వెళ్లేవాడు. సాయంత్రం ఆమె కాలేజీ నుండి తిరిగివచ్చే వేళకు బస్టాపు వద్ద కాచుకుని వుండేవాడు. బాడీగార్డులా ఆమెను ఇంటివరకూ సాగనంపి వచ్చేవాడు... తల వంచుకుని పోయే పాయల్‌కి ఇంత జరుగుతూ వున్నా ఏమీ తెలియదు. తనను ఓ యువకుడు నిత్యమూ వెంబడిస్తున్నాడన్న సంగతినే ఆమె గమనించలేదు.

నెలలు దొర్లుతూవున్నా పాయల్ తన ఉనికిని గుర్తించకపోయే సరికి హుతాశుడయ్యాడు అతను. ఓ రోజున ఆమె ఎదుటపడి తన ప్రేమను వెల్లడించాడు. పాయల్ తెల్లబోయింది. తరువాత భయపడింది. ముక్కూ మొఖమూ ఎరుగని ఓ యువకుడు వచ్చి తనను గాఢంగా ప్రేమిస్తున్నాననే సరికి ఆగ్రహం ఉప్పొంగింది ఆమెలో. ప్రేమ, దోమలంటే తన కిష్టంలేదని, ఎలర్జీ అని నిర్మొహమాటంగా, సూటిగా చెప్పేసింది.

అంతటితో ఆమెను వదలలేదు అతను. రోజూ రెండు పూటలా ఆమెను వెంబడిస్తూనే వున్నాడు. ఆమెతో మాటలు కలపడానికి ప్రయత్నిస్తూనే వున్నాడు. ఆ సంగతి గమనిస్తూనేవున్నా అతన్ని పట్టించుకోవడం లేదామె. అతనికి మౌనమే జవాబైంది.

ఓ అడుగు ముందుకు వేసాడతను. ఆమె శరీరాన్ని ఎక్కడెక్కడో తాకుతూ ఆమెలో ఉద్రేకం కలిగించడానికి ప్రయత్నించేవాడు. అవమానంతో, సిగ్గుతో ఒళ్లు చచ్చిపోతూంటే లోలోపలే కుమిలిపోతూ దుఃఖం దిగమింగుకునేది. ప్రేమ లేఖలు బలవంతంగా ఆమె చేతిలో క్రుక్కనారంభించాడు. వాటిని చదవకుండానే అతని కళ్ల ముందే చించి ముక్కలుచేసేది. ఆమె చర్య అతనిలో ఆగ్రహం రగిలించేది. పురుషహంకారం సెగలు వేసేది. ఆమె తనను, తన ప్రేమను అలక్ష్యం చేసేకొద్దీ అతనిలో పట్టుదల పెరిగిపోయింది. ఆమెను ఎలాగైనా లొంగదీసుకుని తన దాన్ని చేసుకోవాలని శపథం పట్టాడు.

అతని వేధింపులు నానాటికీ అధికం కావడంతో ఇల్లు వదిలి బయటికి అడుగుపెట్టాలంటే భయపడసాగింది పాయల్. పెద్దలకు తెలియపరిస్తే గొడవలు జరగడమే కాక తనకు చెడ్డపేరు కూడా వస్తుంది. తల్లి తనను చదువు మాన్పించేయవచ్చు కూడా. 'ముల్లు – అరిటాకు' సామెతలా తప్పు మగాడిదే అయినా శిక్షను ఆడదానికే విధిస్తుంది సమాజం ఎప్పుడూ. పైగా తండ్రిలేని పిల్ల తాను. తన మూలంగా తల్లి, అన్నయ్య చిక్కుల్లో పడడం తన కిష్టం లేదు. పరీక్షలు సమీపిస్తూంటే చదువుపైన ఏకాగ్రతను కోల్పోయింది.

ఆమె తప్పించుకుపోయే కొద్దీ అతనిలో పెంకితనం పెరిగిపోయింది. ఓ ఆడపిల్ల తనను నిర్లక్ష్యం చేస్తోందన్న భావన అతని అహాన్ని రెచ్చగొట్టింది. నిలదీసాడు ఆమెను.

"నీవనే లవ్‌కి నేను బాధ్యురాలిని కాను. దయచేసి నన్ను విడిచిపెట్టెయ్" అందామె. వినిపించుకోకుండా వెంటపడితే చెప్పుదెబ్బలు తప్పవని బెదిరించింది.

ఉగ్రుడయ్యాడు అతను. "అందగత్తెవని, చదువుకుంటున్నావనీ విర్రవీగకు. నీకు వారం రోజులు గడువిస్తున్నాను. నాకు ఐ లవ్ యూ చెప్పాలి. ప్రేమ వెంటే ద్వేషమూ వుంటుందని మరచిపోకు. నన్ను కాదంటే నీ ముఖం మీద యాసిడ్ పోస్తాను. నాకు దక్కనిది ఇంకెవరికీ దక్కకూడదు. కురూపివై జీవితాంతమూ కుమిలి కుమిలి ఏడుస్తావు" అంటూ తీవ్రంగా హెచ్చరించాడు.

అసహాయత, భయము, ఆందోళనా ముప్పి

రి గొనడంతో కాలేజీకి వెళ్లకుండా ఏడుస్తూ కూర్చుంది పాయల్... అతను పెట్టిన గడువు సమీపించేకొద్దీ భయభ్రాంతులతో, పీడకలలతో నిద్రపట్టడం మానేసింది. ఆకలి చచ్చిపోయింది. చదువు మీద మనసు లగ్నం కావడం మానేసింది. కుదురుగా కాలేజీకి వెళ్లి బుద్ధిగా చదువుకునే తనకు ఆ కీచకుడు ఎందుకు దాపురించాడు అని లోలోపలే కుమిలిపోతూ దుఃఖించసాగింది.

*                *                *

పెరట్లో కూర్చుని మౌనంగా ఏడుస్తూన్న చెల్లెలు కవిత నగేష్ దృష్టిలో పడింది. కవితకు పదిహేడేళ్లుంటాయి. చామన ఛాయ అయినా ఆకర్షణీయమైన రూపం. ఇంటర్ సెకండియర్ చదువుతోంది.

ఎప్పుడూ అల్లరి చేస్తూ నవ్వుతూ నవ్విస్తూ తిరిగే కొంటెపిల్ల వాడిపోయిన వదనంతో చాటున కూర్చుని దుఃఖిస్తూంటే విస్తుపోయాడు నగేష్. కారణం అడిగాడు. అన్నగారిని చూసి కంగారుగా కన్నీళ్లు తుడిచేసుకుంది కవిత. ఏమీ లేదంటూ తప్పించుకోబోయింది.

ఏదో ఉందనిపించింది అతనికి, ఆమె తత్తర పాటు చూస్తే. నిలదీసాడు... అన్నను పట్టుకుని భోరుమంది ఆ పిల్ల. అనునయించి నెమ్మదిగా అడిగితే తెలిసింది ఇది – కవిత కాలేజీకి వెళ్లి వస్తూంటే ఎవడో ప్రేమిస్తున్నానంటూ చాన్నాళ్ల నుంచి వెంటపడి వేధిస్తున్నాడట. తనకు ఇష్టం లేదన్నా వదలకుండా పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేస్తున్నాడట. ప్రేమించమని బెదిరిస్తున్నాడట.

నగేష్‌లో ఆవేశం ఉప్పెనలా పొంగింది. తన చెల్లెల్ని అల్లరిపెట్టడానికి వాడికెన్ని గుండెలు!? ఆ వ్యక్తి పేరు సంపత్ అని, ఏదో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్నాడనీ చెప్పింది కవిత.

"మళ్లీ ఏ ఆడపిల్ల వంకా కన్నెత్తయినా చూడకుండా వాడికి తగిన బుద్ధిచెబుతాను" అంటూ ఉద్రేకంతో వూగిపోతూ బయటకు పరిగెత్తాడు నగేష్. అతను ఏం అఘాయిత్యం చేస్తాడోనన్న భయంతో అన్న వెనుకే పరిగెత్తింది కవిత.

సంపత్‌ది ఇంచుమించు నగేష్ వయసే... స్టూడెంట్స్‌కి క్లాస్ తీసుకుంటూంటే ఆగంతకుడెవరో హఠాత్తుగా వచ్చి క్లాస్‌రూమ్ నుంచి బైటకు లాక్కువెళ్లి తనను ఎడాపెడా నాన్‌స్టాప్‌గా వాయిస్తూంటే అవాక్కయ్యాడు.

"ఎవరు నువ్వు? ఏమిటి ఈ దౌర్జన్యం?" అనడిగాడు తేరుకుని.

"లవ్వూ గివ్వూ అంటూ కొవ్వెక్కి... నేను పువ్వులా చూసుకుంటూన్న నా చెల్లెలి వెంటపడి వేధిస్తున్న ఆ గాడిద కొడుకువి నువ్వేగా? నిన్ను ప్రేమించకపోతే నా చెల్లెల్ని చంపేస్తావా? అంతకంటే ముందు నేనే నీ ప్రాణాలు తీస్తాన్రా రాస్కెల్!" నోటికి వచ్చినట్టు తిడుతూ చేతికి వచ్చినట్టు కొట్టసాగాడు నగేష్.

అక్కడ మూగిన స్టూడెంట్స్, ఇతరులూ చిత్ర ప్రతిమలే అయ్యారు ఆ దృశ్యం చూసి.

అతని దెబ్బల్ని కాచుకోవడానికి ప్రయత్నిస్తూ, "ఎవరు నువ్వు? నీ చెల్లెలెవరు? నేను నీ చెల్లెలి వెంట పడడమేమిటి? నువ్వేదో రాంగ్ పర్సన్ దగ్గరకు వచ్చినట్టున్నావ్" అన్నాడు సంపత్ అయోమయంగా.

అంతలో అక్కడికి పరిగెత్తుకుని వచ్చిన కవిత, "అన్నయ్యా! ఆగు నేను చెప్పేది విను..." అంటూ అడ్డుపడబోయింది.

"కవితా! తప్పుకో... నా చెల్లెలిమీద చేయి వేసిన వాణ్ణి నరికేస్తాను" అంటూ ఉద్రేకంతో ఊగిపోయాడు. నగేష్.

సంపత్ తెల్లబోయి చూస్తూంటే, "ఏం, ప




రాయి వాళ్ల చెల్లెళ్లమీద నువ్వు చెయ్యి వెయ్యొచ్చా?" అంది కవిత సూటిగా. నగేష్ ఉలిక్కిపడి, "చెల్లీ...!" అన్నాడు.

"ఔను, నీ చెల్లెల్నే మాట్లాడుతున్నాను. నా ఒంటిమీద ఎవరో చేయి వేసారంటేనే నీకింత రోషమూ, పౌరుషమూ పొడుచుకు వచ్చాయే... మరి నువ్వు మరొకరి చెల్లెల్ని వేధిస్తూ నీకు లొంగలేదని ముఖంమీద యాసిడ్ పోస్తానని బెదిరిస్తే... ఆమె అన్నకెంత ఆవేశం కలగాలి!?"

"కవితా! ఏమిటా వాగుడు?" కోపంతో చెల్లెల్ని కసురుకున్నాడు నగేష్.

"ఔనన్నయ్యా... నువ్వు వెంటపడి వేధిస్తున్న పాయల్ ఈ సంపత్ గారి చెల్లెలే..."

"ఆ...!?"

"ఔను. పాయల్, నేనూ ఒకే కాలేజ్‌లో చదువుకుంటున్నాము. అనుకోకుండా పాయల్ క్లోజ్ ఫ్రెండ్ ద్వారా ఆమె సమస్య నా చెవిన పడింది. ఆ కీచకుడు నువ్వేనని తెలిసింది. అమ్మానాన్నలతో నీ విషయం చెప్పాలనుకున్నాను. కాని అందువల్ల ఫలితం వుంటుందనిపించలేదు. అందుకే పాయల్ స్థానంలో నీ చెల్లెలే వుంటే నువ్వెలా ఫీలవుతావో నీకు తెలియచెప్పాలనిపించింది... సంపత్‌గారు నావెంట పడ్డట్టు నీతో కట్టు కథ చెప్పాను. నిజానికి ఈ విషయం ఆ అన్నాచెల్లెళ్లకు కూడా తెలీదు..." వివరించింది కవిత.

నగేష్ నిర్ఘాంతపోయాడు. గుడ్లప్పగించి చెల్లెలి వంక చూస్తూండిపోయాడు.

అన్న చెయ్యి పట్టుకుంది కవిత. "అన్నయ్యా! నీ చెల్లెలినెవరో అల్లరిపెడుతున్నారంటేనే నీకింత ఆవేశం ముంచుకు వచ్చిందే! మరి నీ సంగతి పాయల్ పెద్దలకు తెలిస్తే ఏమౌతుందో ఆలోచించావా? నువ్వు అల్లరిపెట్టే ప్రతి ఆడపిల్ల మరొకరికి చెల్లెలో, కూతురో, తల్లో, పెళ్లామో అయి వుంటుందనే సత్యం గ్రహించు. నీ చెల్లెలు సమాజంలో గౌరవంగా, స్వేచ్ఛగా బ్రతకాలని నువ్వెలా కోరుకుంటున్నావో... ఇతర ఆడపిల్లల తల్లిదండ్రులు, అన్నదమ్ములూ కూడా తమ పిల్లల గురించి అలాగే కోరుకుంటారని ఎందుకు ఊహించలేవు? ఊళ్లోని ఆడ

పిల్లలందరినీ చెల్లెళ్లుగా భావించమని నేను చెప్పను. కాని, నీ చెల్లెలు పొందాలని నువ్వు అభిలషించే గౌరవమర్యాదలను, పరువు ప్రతిష్ట లను ఆ పిల్లలకు దక్కకుండా చేయొద్దని మాత్రం నిన్ను వేడుకుంటున్నాను. ఎవరి పిల్లై నా... ఆడపిల్లను పరువుగా నిర్భీతితో తిరగనివ్వ మంటున్నాను" ఆవేశంతో అంది.

నగేష్ తల సిగ్గుతో అవమానంతో వాలిపో యింది. తనకంటే ఎంతో వెనుక పుట్టిన చెల్లెలి చేత బుద్ధి చెప్పించుకోవలసి వచ్చినందుకు సిగ్గు తో కృంగిపోయాడు.

అన్న వాలకం గమనించి మళ్లీ అందామె "అసలు ఆడపిల్లలంటే ఏమనుకుంటున్నారు మీరు? ఒకడు వెంటపడి వేధిస్తాడు. మరొకడు ముఖం మీద యాసిడ్ పోస్తాడు. ఇంకొకడు పట్టపగలే కత్తితో పొడిచి చంపుతాడు. అదంతా ప్రేమకోసమేనన్న రంగు పులుముతారు. మీరు ప్రేమించాననగానే పొంగిపోయి లొంగిపోయి మీవాళ్లో వాలిపోయే ఆట బొమ్మ కాదు ఆడపి ల్లంటే. మీరు చెప్పగానే ఆమె మిమ్మల్ని ఎందుకు ప్రేమించాలి? ఆమెకు ఇష్టాయిష్టాలు వుండ వా? అసలు ఓ పిల్లను ప్రేమించానని చెప్పే ముందు మీ అర్హతలేమిటో, ఆమెకు మీరు తగి నవారో కాదో ఆలోచించరా? మగవాడినన్న అహంకారంతో అమాయకురాలైన ఆడపిల్ల వెం టపడి ప్రేమా, పెళ్లీ అంటూ ఆమె జీవితం నా శనం చేసే అధికారం మీకెవరిచ్చారు? ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే మీ జీవితాలు బాగుపడతాయన్న సత్యం మీరెప్పుడు గుర్తిస్తారు...?" అక్కడ చేరిన వారంతా అవా క్కయి వినసాగారు.

"నీలాంటి కొందరి యువకులు బుద్ధికి గ్రహణం పట్టి అభినవ కీచకుల్లా మారబట్టే ఆడపిల్ల వీధిలో సురక్షితంగా తిరగలేకపో తోంది. ఆ గ్రహణం వీడితేగాని మాలాంటి వారికి రక్షణ వుండదు, సమాజం బాగుపడ దు... అన్నయ్యా! చిన్నపిల్లను పెద్దమాటలు ఆడుతున్నానని కోపగించుకోకు. ఇది నాలాంటి ఎందరో ఆడపిల్లల ఆక్రోశం, ఆవేదనాను".

'వయసులో చిన్నదైనా తన అపరాధం ఏమి టో ఎంత తెలివిగా, సున్నితంగా తెలియపరిచిం ది!' అనుకున్నాడు నగేష్. చెల్లెలు ఎంతో ఎత్తుకు ఎదిగిపోయినట్లనిపించింది. తాను ఎన్నో మెట్లు దిగజారిపోయినట్లనిపించింది. అపరాధ భావన కమ్ముకోవడంతో చటుక్కున సంపత్ చేయి పట్టు కున్నాడు. "మూర్ఖత్వంతో మీ చెల్లెల్ని వేధించి బాధపెట్టాను. అకారణంగా మిమ్మల్ని కొట్టాను. నా తప్పు తెలుసుకున్నాను. క్షమించమని అడిగే అర్హత నాకు లేదు. అయినా అడుగుతున్నాను – మీరూ, మీ చెల్లెలూ మనస్ఫూర్తిగా నన్ను మన్నిస్తారు కదూ?" అన్నాడు గద్గదస్వరంతో, తన బుద్ధిని పట్టిన గ్రహణం వీడిపోవడంతో. "మీ చెల్లెలే కాదు ఇంకెప్పుడూ ఏ ఆడపిల్లజోలికీ వెళ్లనని వాగ్దానం చేస్తున్నాను".

అన్నగారిలో వచ్చిన మార్పుకు కవిత కళ్లలో ఆనందం వెల్లివిరిసింది.

అప్పటికి విషయం అర్థమైన సంపత్ తాను తిన్న దెబ్బలమాట మరిచిపోయాడు. తన చెల్లె లికి వచ్చిన ఆపద తనవరకూ రాకుండానే పరి ష్కారమైనందుకు సంతోషం కలిగింది అతనికి. కవిత వంక కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ, అనునయంగా నగేష్ భుజం తట్టాడు.

అన్నగారి కోసం అప్పుడే అక్కడకు వచ్చిన పాయల్ నగేష్‌ని చూసి భయపడ్డా, విషయం తెలుసుకుని మహదానందం చెందింది. నగేష్ చేతులు జోడించి తనకు క్షమాపణలు చెబుతుం టే చెమర్చిన కళ్లతో కవితకు కృతజ్ఞతలు తెలు పుతూ స్నేహపూర్వకంగా కౌగిలించుకుంది. ●